హైవే దాటాలంటే హడల్..!

- జాతీయ రహదారి కప్పరాడ జంక్షన్‌లో ప్రమాదాలకు గురవుతున్న పాదచారులు
- అసంపూర్తిగా వదిలేసిన కాలిబాట వంతెన పనులు
- ప్రజల ఇబ్బందులను పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి



హైవే దాటుతున్న పాదచారులు

కంచరపాలెం: జాతీయ రహదారిలో కంచరపాలెం కప్పరాడ జంక్షన్ వద్ద రోడ్డు దాటేందుకు కొండవాలు ప్రాంతాల ప్రజలు హడలి పోతున్నారు. ఇక్కడ నిర్మించ తలపెట్టిన కాలిబాట వంతెన నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేయడంతో పాదచారులు రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు క్షతగాత్రులుగా మిగులుతున్నారు. ఈ సమస్య తెలిసినా.. స్థానిక ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు ఇటుగా కన్నెత్తి చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

2010లో శ్రీకారం.. ఆపై బ్రేక్

జీవీఎంసీ 47, 48 వార్డుల్లో నివసిస్తున్న కొండవాలు ప్రాంతాల ప్రజలు జాతీయ రహదారి నుంచి 54, 55 వార్డుల పరిధిలోని కంచరపాలెం బీఆర్‌టీఎస్ మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే కప్పరాడ కూడలి వద్ద హైవేను దాటాల్సి ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని 15 ఏళ్ల కిందట నిర్ణయించారు. జీవీఎంసీ అధికారులు, విశాఖ స్టీల్ ప్లాంట్ అధికారుల సహాయంతో 2010లో సుమారు రూ.19.89 లక్షలతో పనులు ప్రారంభించారు. కంచరపాలెం జాతీయ రహదారి బస్టాప్ దరి సాయి ధ్యాన మందిరం వద్ద రోడ్డుకు ఇరువైపులా పిల్లర్లు, కాంక్రీటు దిమ్మలు వేశారు. రెండు దశల్లో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. కాంక్రీట్ దిమ్మలు, పిల్లర్లతో మొదటి దశ పనులకు శ్రీకారం చుట్టిన అధికారులు మిగిలిన పనులు చేపట్టలేదు. తొలి దశ పనులు ప్రారంభించి పుష్కర కాలం పూర్తి కావడంతో అక్కడి దిమ్మలు కూడా శిథిలావస్థకు చేరాయి.

నిత్యం వాహనాల రద్దీ

జాతీయ రహదారిలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ విపరీతంగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు జనం నానా తంటాలు పడుతున్నారు. కంచరపాలెం కప్పరాడ బస్టాప్ వద్ద పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, కూలి పనులకు వెళ్లే వారు, బాటసారుల రద్దీ దృష్ట్యా అక్కడే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ పనులు పూర్తి చేయకపోవడంతో హైవే దాటేందుకు స్థానికులు, పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న వారు సైతం అనేక మంది ఉన్నారు.



కప్పరాడ జంక్షన్‌లో పాదచారులు నడిచే మార్గంలో ట్రాఫిక్ సమస్య



పాదచారులు హైవే దాటే చోట దూసుకొస్తున్న వాహనాలు

ఔట్‌పోస్టులున్నా.. పోలీసులు సున్నా..

జాతీయ రహదారి మీదుగా నిత్యం వేల సంఖ్యలో కొండవాలు ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. హైవేలో కప్పరాడ కూడలి నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి వెళ్లే వారు భయం భయంగా రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు, పాదచారుల రాకపోకలను పర్యవేక్షించేందుకు, ఎండావానల నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ పోలీసుల కోసం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన రింగ్ ఔట్‌పోస్టుల్లో సిబ్బంది జాడే కనిపించదు. ఆకతాయిలు, బిచ్చగాళ్లు ఈ ఔట్‌పోస్టులను వాడుకుంటున్నారు.



ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో నిరుపయోగంగా రింగ్ ఔట్‌పోస్ట్



కంచరపాలెం జాతీయ రహదారిలో అసంపూర్తిగా వదిలేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి బ్లాక్‌లు

ఎమ్మెల్యేలు మారినా.. ప్రయోజనం శూన్యం

నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు మారుతున్నా.. కొండవాలు ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం శూన్యంగా కనిపిస్తోందని, తమ రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు పదేళ్ల పాలన.. మళ్లీ కూటమి ఎమ్మెల్యేగా విష్ణుకుమార్‌రాజు వచ్చినా ఈ సమస్యపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి హైవేలో కంచరపాలెం కప్పరాడ జంక్షన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

భయం భయంగా రోడ్డు దాటుతున్నాం



కప్పరాడ కొండవాలు నుంచి జాతీయ రహదారికి వచ్చి అవతలి వైపు కంచరపాలెం మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటేనే చాలా భయంగా ఉంటోంది. ఈ కూడలి వద్ద నిత్యం వాహనాల రద్దీతో రోడ్డు దాటలేకపోతున్నాం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఏదో విధంగా ధైర్యం చేసి పాదచారులు, విద్యార్థులు హైవే దాటుతున్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలి.

– జి.వెంకటలక్ష్మి, తిక్కవానిపాలెం

ప్రజల ఇబ్బందులు పట్టించుకోండి



ప్రజల ఇబ్బందులు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కప్పరాడ జంక్షన్ వద్ద కాలిబాట వంతెన నిర్మిస్తామన్న నాయకుల హామీలు నీటిమూటగానే మిగిలిపోయింది. హైవే దాటే సమయంలో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి హైవేలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– ఉందూరి సతీష్, కప్పరాడ

క్లుప్తంగా

సీజేఐపై దాడి అత్యంత హేయం

సీతంపేట: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ బూటుతో దాడికి యత్నించడాన్ని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు సొసైటీ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజేఐపై జరిగిన దాడిని రాజ్యాంగ వ్యవస్థపై దాడిగా భావిస్తున్నట్టు చెప్పారు. దాడికి పాల్పడిన న్యాయవాదిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హెచ్‌ఆర్‌సీ ఉపాధ్యక్షురాలిగా జయంతి రాధాకుమారి



తాటిచెట్లపాలెం: హ్యూమన్ రైట్స్ సెల్(హెచ్‌ఆర్‌సీ) ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఎన్నికయ్యారు. జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఎం.నాయుడు, మంగయ్యనాయుడు, హెచ్‌ఆర్‌సీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం, సుదర్శన్ పట్నాయక్‌లు ఆమెను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. సంఘ సేవకురాలు సురుగుడి మల్లేశ్వరిని స్టేట్ అడిషనల్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా రాధాకుమారిని పలువురు అభినందించారు.

ఎక్కడ చూసినా చెట్ల కొమ్మలే..



శ్రీనగర్ రోడ్డులో వదిలేసిన చెట్ల కొమ్మలు

సీతంపేట: రామాటాకీస్ సమీపంలోని శ్రీనగర్ రోడ్డులో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దసరా పండగ రోజున వీచిన గాలివాన బీభత్సానికి చెట్లు, వాటి కొమ్మలు పెద్ద ఎత్తున విరిగి పడ్డాయి. రెండు రోజుల తర్వాత దారికి అడ్డంగా ఉన్న చెట్లు, కొమ్మలను నరికి రోడ్డు పక్కన కుప్పలుగా వేశారు. ఐదు రోజులు కావస్తున్నా వాటిని తరలించకుండా వదిలేశారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు చెట్ల ఆకులు కుళ్లి రోడ్డంతా విస్తరించి చుట్టుపక్కల నివాసులకు ఇబ్బందిగా మారాయి. డే అండ్ నైట్ ఆస్పత్రి రోడ్డు, ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వద్ద వదిలేసిన చెట్ల కొమ్మలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి గోతులమయం



రామాటాకీస్ రోడ్డులో ఏర్పడిన గోతులు

సీతంపేట: రామాటాకీస్ కూడలి సమీపంలోని రహదారి గోతులమయంగా మారింది. రామాటాకీస్ జంక్షన్ నుంచి ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఎస్‌వీఆర్ ట్రావెల్స్ వద్ద రోడ్డు మొత్తం గోతులతో నిండిపోయింది. రామాటాకీస్ నుంచి సత్యం జంక్షన్, శ్రీనగర్, సీతమ్మధార ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇటువంటి రద్దీ మార్గంలో గోతులు ఏర్పడి నెలలు గడుస్తున్నా.. వాటిని కాంక్రీట్‌తో పూడ్చే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రధాన రహదారుల్లో గోతులను పూడ్చడానికి తీరిక లేదని జనం మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఆలయంలో హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ హోమంలో దేవస్థానం కౌంటర్‌లో రూ.516 చెల్లించిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్లు



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



వ్యాక్సిన్ కోసం వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థినులు

సీతంపేట: రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ, మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యామందిర్‌లో విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్లు వేశారు. ముఖ్య అతిథి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి బాలిక ఆరోగ్యం కూటమి ప్రభుత్వ బాధ్యతన్నారు. బాలికలు, యువతల ఆరోగ్య పరిరక్షణ కోసం రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ చేపడుతున్న ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ మహిళలు భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు రక్షణగా 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థినులకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. తొలి విడతగా 500 మంది విద్యార్థినులకు వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రజా సేవకులు కమల్ బైద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బి.శివాజీ, కార్యదర్శి టి.భార్గవ్, పర్యవేక్షకులు జి.ఎస్.రాజు, ఆర్.రామకృష్ణారావు, కె.వి.రమణ పాల్గొన్నారు.

ప్రథమ సాహితీవేత్త వాల్మీకి మహర్షి



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అతిథులు, వక్తలు

తాటిచెట్లపాలెం: రామాయణ రూపకర్త వాల్మీకి మహర్షి ప్రథమ సాహితీవేత్తని వక్తలు కొనియాడారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ విశాఖ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో వాల్మీకి జయంతి సభ నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ రామాయణ గాథ భారతీయ సంప్రదాయంలో నిండిపోయిందని, వాల్మీకి తపస్సంపన్నుడని వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ మోపిదేవి విజయ్‌గోపాల్ మాట్లాడుతూ అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆశయాలను విశదీకరిస్తూ, భారతీయ సమాజం నమ్మిన సిద్ధాంతాలను వాల్మీకి సాహిత్యంలో పొందుపరిచారన్నారు. బీవీకే కళాశాల సంస్కృత అధ్యాపకురాలు పేరాల హరిప్రియ మాట్లాడుతూ భారతీయత అనగానే మనకు రామాయణం గుర్తుకు వస్తుందని, అటువంటి మహాకావ్యాన్ని మనకు అందించిన మహాత్ముడు వాల్మీకి అని అభివర్ణించారు. కార్యక్రమంలో సిహెచ్.చిన సూర్యనారాయణ, శంకరనీలు, సోమంచి వినయభూషణ, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, ఎం.రాధారాణి, పేరాల భరత్, ఎం.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

డే-నైట్ షెల్టర్లపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఈ నెల 10న ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డే-నైట్ షెల్టర్లపై డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించి, షెల్టర్ల స్థితిగతులపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమీక్ష చేశారు. ఏయూటీడీ సంస్థ నడుపుతున్న మూడు షెల్టర్లకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం, రాత్రి భోజనం నిధులు ఇవ్వడం లేదని ఏయూటీడీకి చెందిన ప్రగడ వాసు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నెలకు ఒక్కొక్క షెల్టర్‌కు రూ.61,000 చెల్లించడంలో జీవీఎంసీకి వచ్చిన ఇబ్బంది ఏంటని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని నిధులు ఇచ్చే చూడాలని ఆయన కోరారు. మిగతా 5 షెల్టర్లకు బాగానే చెల్లిస్తున్నారని, ఏయూటీడీకి మాత్రం చెల్లించడం లేదన్నారు. తదుపరి స్టాండింగ్ కమిటీ సమావేశంలో కచ్చితంగా ఆమోదం తీసుకుని పాత బిల్లులు క్లియర్ చేసి ఇక నుంచి జీతాలు ప్రతి నెలా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్లు వర్మ, రమణమూర్తి, యూసీడీ పీడీ సత్యవేణి, ఏయూటీడీ తరపున జ్యోతిర్మయి, రెడ్ క్రాస్ నుంచి రవికుమార్, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతన బకాయిలకు సరిపడా భూమివ్వండి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన బకాయిలు బాగా పెరిగిపోతున్నాయని, వీటి విలువకు సరిపడా ప్రభుత్వ భూమిని వారికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన జీవీఎంసీ కార్యాలయం దరి వైఎస్సార్ పార్క్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన విశాఖపట్నం కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల గురించి సవివరంగా ఉద్యోగులందరికీ తెలియ జేస్తున్నామన్నారు. మొత్తం రావాల్సిన బకాయిలన్నింటినీ వారి సర్వీస్ రిజిస్టర్‌లో ముందుగా పొందుపరచాలని చెప్పారు. ఆ సొమ్ముకు తగ్గ ప్రభుత్వ భూమిని ఉద్యోగులందరికీ ఇచ్చి బకాయిల సమస్యను పరిష్కరించాలని సూర్యనారాయణ కోరారు. సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమైన కటుమూరి సతీష్, సేనాపతి అప్పారావు



మాట్లాడుతున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా మెడికల్ కాలేజీ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పిలుపునిచ్చారు. తాటిచెట్లపాలెంలోని సేనాపతి అప్పారావు కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య శ్రేణులతో సమావేశమై పర్యటన సందర్భంగా పలు అంశాలపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గోవిందరాజు, కె.ఈశ్వర రావు, దూది నరసింగరావు, అప్పలరెడ్డి, రామారావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

అధినేతకు ఘన స్వాగతం పలుకుదాం

మద్రిపాలెం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పిలుపునిచ్చారు. వార్డులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని మెడికల్ కాలేజీని సందర్శించడానికి పార్టీ అధినేత ఈ నెల 9వ తేదీ ఉదయం 9 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. వార్డు నుంచి 200 మంది విమానాశ్రయానికి తరలివెళ్లి ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నాడ అప్పారావు మాస్టర్, బుడుమూరు తిరుమలరావు, మెట్ట దమయంతి, సారిక నూకరాజు, సనపల కొండలరావు, సీపాన లత, కొత్తపల్లి రాణి, కింతల వరహాలరాజు, మైలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబు కుటుంబానికి పరిహారమివ్వాలని వినతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగంలో ఎలక్ట్రికల్ హెల్పర్‌గా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుడు ఎం.సత్తిబాబు ప్రమాదవశాత్తు మరణించాడని, అతడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, సంస్థ నుంచి ఇవ్వాల్సిన ఇతర పరిహారాలు మంజూరు చేయాలని జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. మురళీనగర్ వద్ద విద్యుత్ పోల్‌పై సత్తిబాబు మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, స్తంభం పైనుంచి కింద పడటం వల్ల మరణించాడన్నారు. జీవీఎంసీలో 15 ఏళ్లుగా సత్తిబాబు పనిచేస్తున్నాడని, ఎక్స్‌గ్రేషియాతోపాటు సంస్థ ఇవ్వాల్సిన పరిహారాలు మంజూరు చేయాలని కమిషనర్‌ను బాణాల కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి హైస్కూల్ పరిసరాల్లో ర్యాలీ చేపట్టారు. కౌన్సిలర్లు ఝాన్సీ, రమ మాట్లాడుతూ మంచి మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులు ఆశపడి ఆందోళనకు గురవుతున్నారన్నారు. దీని కోసం విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మానసిక ఆందోళన, ఒత్తిడిని అధిగమించడానికి యోగా అవసరమన్నారు. యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. దీంతోపాటు రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు, కాయగూరలు, పండ్లు తినాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జీఎస్టీ ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ



రాలీ చేస్తున్న మాధవధార హైస్కూల్ విద్యార్థులు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం బి.హేమలత ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీఎస్టీ ప్రయోజనాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు రోల్‌ప్లే చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారావు, ఉషాకిరణ్, సంజీవమ్మ, నాయుడు, పీడీలు బాలరాజు, మంగమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



సిరులతల్లికి కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే లక్ష కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ ప్రత్యేక పూజ జరిగింది. లక్ష కుంకుమార్చనలో రూ.10 వేలు చెల్లించిన భక్తుల తరపున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుందన్నారు. పూజలో పాల్గొన దలచిన భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో పూజా రుసుం చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 లేదా మెయిల్ ఐడీ endowoekanaka@gov.in ద్వారా పంపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు అలాట్మెంట్ లెటర్లు



అభ్యర్థికి అలాట్మెంట్ లెటర్ అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: రెండో విడతగా ఐటీఐ పూర్తి చేసిన అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తన ఛాంబర్‌లో అలాట్మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రెంటిస్‌షిప్ చేస్తున్న వారు తప్పనిసరిగా వివిధ డిపోల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని, సరైన పనిముట్లతో పని నేర్చుకోవాలన్నారు. అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన వారిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ డిపోల్లోకి తీసుకుంటామని తెలిపారు. అందుకు సమీపంలో ఉన్న డిపోల్లో సంప్రదించాలని సూచించారు. 18 నెలల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ గల వారిని సమీపంలో ఉన్న డిపోల్లో ఆన్ కాల్ డ్రైవర్లుగా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.